క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



సర్పంచ్ వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ కెంబూరి వెంకటేశ్వరరావు ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయాలపాలై, ప్రస్తుతం రాజాం పట్టణంలోని సన్‌రైజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్‌లు ఆయనను శనివారం కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అప్పాపురం, సోమరాజుపేట, వన్నలి సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, సవళాపురపు రమేష్‌నాయుడు, గార రమణ, పాలవలస దవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

17న రెండో విడత ఎస్‌ఎంసీ ఎన్నికలు

రేగిడి: మండలంలో ఈ నెల 8వ తేదీన జరగాల్సిన ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా పడిన పాఠశాలల్లో రెండో విడతలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఎంపీ ప్రసాదరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. సోమరాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మునకలవలస మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, చిన్నశిర్లాం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, తునివాడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఈ నెల 17వ తేదీన ఎన్నికలు జరుగుతాయని, విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించాలన్నారు.

రాజాం సిటీ: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8వ తేదీన నిర్వహించిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో మూడు పాఠశాలల్లో జరగాల్సిన ఎన్నిక వాయిదా పడింది. ఆయా చోట్ల ఈ నెల 17వ తేదీన ఎన్నికల నిర్వహణకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆగూరు, సీతంపేటం, డోలపేట పాఠశాలల్లో ఎన్నికలకు సంబంధించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశామని ఎంఈవో–2 వై.దుర్గారావు తెలిపారు. ఓటర్ల జాబితాను పాఠశాలల్లో అందుబాటులో ఉంచామన్నారు.

వాహన తనిఖీలు



వాహనదారుడి లైసెన్స్ పరిశీలిస్తున్న ఎస్‌ఐ జ్ఞానప్రసాద్

రామభద్రపురం: మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ సిబ్బందితో కలిసి వాహనదారుల లైసెన్స్, వారి వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహనాల ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.


ఆరోగ్య తనిఖీలు



జ్వరపీడితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీస్తున్న వైద్యాధికారులు అసిరినాయుడు, సోహినీరాఘవ్

రేగిడి: మండలంలోని వండానపేటలో రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు సీహెచ్ అసిరినాయుడు, సోహినీరాఘవ్‌లు శిబిరానికి హాజరైన వారితో పాటు ఇంటింటికీ వెళ్లి, జ్వరాలతో బాధపడుతున్న వారి ఆరోగ్యం తనిఖీ చేశారు. అవసరమైన వారికి మందులు, ఆరోగ్య సూచనలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాని సూచించారు.

గంజాయి రవాణాపై నిఘా..



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై లోవరాజు

బొబ్బిలి: గంజాయి, డ్రగ్స్, సారా తదితర నిషేధిత పదార్థాలను రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని ఎస్సై జి.లోవరాజు అన్నారు. పట్టణంలోని పలు కూడళ్ల వద్ద శనివారం వాహన తనిఖీ చేపట్టారు. గంజాయి, సారా తరలింపుపై నిఘా పెట్టినట్లు చెప్పారు. అనుమానిత వ్యక్తుల వివరాలు ఆరాతీశారు. ఆయనతో పాటు ఏఎస్సై జి.భాస్కరరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అరాచకమే లక్ష్యంగా కూటమి పాలన

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్



కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రాజాం సిటీ: రాష్ట్రంలో అరాచకం సృష్టించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి టీడీపీ శ్రేణులు పాల్పడిన తీరును నిరసిస్తూ స్థానిక పాలకొండ జంక్షన్ నుంచి మాధవబజార్‌లోని వైఎస్సార్ జంక్షన్ మీదుగా పాలకొండ జంక్షన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న రాజ్యాన్మోదంపై ప్రజాగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ఇంతటి దారుణాలకు ఒడిగట్టడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. విజయవాడలోని అంబేడ్కర్ స్మృతి వనం శిలాఫలకం ధ్వంసమనేది రాజ్యాంగ నిర్మాతకు జరిగిన అవమానంగానే ప్రజలు భావిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం అలా కాకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై దాడులకు తెగబడడం, వారి ఆస్తులను నాశనం చేయడం వంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ప్రజలు అధికారం ఇచ్చింది సమస్యలు పరిష్కరించడానికేనని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి కాదన్నారు. ఇలాంటి చర్యలతో మీ గెలుపును కూడా ప్రజలు హర్షించడం లేదనే విషయాన్ని కూటమి నేతలు గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో ఇన్ని జరుగుతున్నా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి నోరు మెదపకపోవడం మరింత అరాచకాలను ప్రోత్సహించడమేనన్నారు. ఇప్పటికైనా ఇటువంటి దుశ్చర్యలను ఆపి, పాలనపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, నాయకులు వాకముళ్ల చిన్నంనాయుడు, యాలాల వెంకటేష్, ఆశపు సూర్యం, దూబ గోపాలం, శాసపు వేణుగోపాలనాయుడు, నక్క శ్రీను, కొర్ను ఈశ్వరరావు, కామోదుల శ్రీరంగం, పాలవలస గోపి, గార సత్యనారాయణ, పాలవలస శ్యాంసుందర్, గోకవలస బాబూరావు, ముద్దన సత్యారావు, సతీష్, కోరాడ రామినాయుడు, పాలవలస రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది

తెర్లాం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రెడ్డి శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ భాస్కరరావు అన్నారు. తెర్లాం–5 అంగన్‌వాడీ కేంద్రంలో సీజనల్ వ్యాధులపై, తల్లిపాల ప్రాముఖ్యతపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు గుర్తించిన వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రసవించిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టాలని, తద్వారా బిడ్డలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

అనంతరం గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ప్రశాంతి, హెల్త్ అసిస్టెంట్ గంగునాయుడు, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, హెల్పర్ లక్ష్మి, ఆశ వర్కర్ సరోజినమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నిరుపేదలకు బియ్యం పంపిణీ



నిరుపేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న జయబాబు

బొబ్బిలి: పట్టణ శివారు కాలనీలు, పాత బొబ్బిలితో పాటు, మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధులు, దివ్యాంగులకు స్థానిక హ్యాండ్ ఇన్ హ్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు కె.జయబాబు చేతుల మీదుగా ఒక్కొక్కరికీ 10 కిలోల చొప్పున 40 మందికి నిరుపేదలకు బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

మాతాజీలకు శిక్షణ తరగతులు



శిక్షణా తరగతులను నిర్వహిస్తున్న జగన్నాథరావు

బొబ్బిలి: పార్వతీపురం డివిజన్‌లోని 15 మండలాల్లో బాలవికాస కేంద్రాల మాతాజీలకు పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో శిక్షణా తరగతులు నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ తరగతుల్లో జిల్లా ఉపాధ్యాయ కన్వీనర్ కొల్లూరు జగన్నాథరావు, జన్ని ముత్యాలు తదితరులు పాల్గొని పలు అంశాలపై మాతాజీలకు అవగాహన కల్పించారు. విద్వాన్ కళాశాల కరస్పాండెంట్ మరిపి వేణుగోపాలనాయుడు శిక్షకులు, మాతాజీలకు భోజనాలు ఏర్పాటు చేశారు.

రోడ్లకు మరమ్మతులు



రోడ్లను పరిశీలిస్తున్న చైర్మన్ మురళీకృష్ణారావు, అధికారులు

బొబ్బిలి: మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు ఆదేశాలతో అధికారులు పట్టణంలోని కంచర వీధి, ఓంకార్ థియేటర్ రోడ్డు, అమ్మిగారి కోనేరు గట్టు రోడ్లను మరమ్మతులు చేయిస్తున్నారు. ఈ రోడ్ల పరిస్థితిని స్థానికుల అభ్యర్థన మేరకు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శనివారం మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు పరిశీలించారు. వెంటనే ఇందుకు తగిన అంచనాలతో తాత్కాలిక మరమ్మతులు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించడంతో అధికారులు పనులు చేపడుతున్నారు. పనులను త్వరగా పూర్తి చేసి రహదారులను అందుబాటులోకి తేవాలని అధికారులను చైర్మన్ ఆదేశించారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు



యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి

బొబ్బిలి: పట్టణంలోని సీబీఎం గరల్స్ హైస్కూల్‌లో యూటీఎఫ్ 50 వసంతాల వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యారంగ పరిరక్షణ, ఫెడరేషన్ ఏర్పాటు, రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన వంటి అంశాలపై ఆమె ప్రసంగించారు. ఉపాధ్యాయ సంక్షేమం కోసం పని చేస్తున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను డిసెంబర్‌లో కాకినాడలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన షటిల్ పోటీల్లో విజేతలుగా నిలిచినవారిని అభినందించారు. జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, మధుసూదనరావు, జిల్లా కౌన్సిలర్ ఆనెం శ్రీనివాసరావు, కె.కృష్ణదాసు, తదితరులు పాల్గొన్నారు.

కట్టెలపొయ్యిపై వంట కష్టాలు



కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న నిర్వాహకులకు పెద్ద కష్టమే వచ్చిపడింది. వేగావతి నదికి ఓ వైపు గ్రామం ఉండగా.. నదికి మరోవైపు ఈ పాఠశాల ఉంది. ఊరు శివారు కావడంతో గుర్తుతెలియని వ్యక్తులు పలుమార్లు వంటగదిలోని సరుకులను ఎత్తుకెళ్లిపోయారని నిర్వాహకులు వాపోతున్నారు. రెండుసార్లు గ్యాస్ స్టవ్, సిలెండర్లను ఏర్పాటు చేసుకున్నామని, వాటిని కూడా దొంగలు పట్టుకుపోవడంతో ఏడాదిగా కట్టెల పొయ్యిపై వంట చేస్తూ విద్యార్థులకు పెడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంటగది కూడా చాల చిన్నది కావడం, ప్రభుత్వం ద్వారా వచ్చిన సరుకులను ఇందులోనే ఉంచాల్సి రావడంతో కట్టెలను ఆరుబయట ఉంచాల్సి వస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆరుబయట ఉన్న కట్టెలు తడిసిపోవడంతో వంట చేసేందుకు నరకయాతన అనుభవించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు స్పందించి తమకు గ్యాస్ సిలెండర్ ఏర్పాటుకు ముందుకు వస్తే కాస్త ఊరటగా ఉంటుందని, సమయానికి విద్యార్థులకు వంటచేసి అందించగలమని నిర్వాహకులు కోరుతున్నారు.

ప్రమాద కూడళ్లు



స్థానిక ఉన్నత పాఠశాల వద్ద రోడ్డుపై వాహనాల రద్దీతో రోడ్డు దాటేందుకు భయపడుతున్న విద్యార్థులు



రామభద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వాహనాల వేగాన్ని నియంత్రిస్తున్న హోంగార్డ్

రామభద్రపురం: మండల కేంద్రం పరిధిలోని జాతీయ రహదారిపై ఉన్న పలు కూడళ్లు ప్రమాదకరంగా మారాయి. ఆ జంక్షన్ల వద్ద ఇప్పటికే పలు ప్రమాదాలు జరగడంతో పలువురు మృత్యువాత పడగా మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. రహదారి మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల వాహన చోదకులు అతి వేగంగా వాహనాలు నడపడంతో పాదచారులు రోడ్డు దాటేందుకు కూడా భయపడే పరిస్థితి. బైపాస్ రోడ్డు మీదుగా సాలూరు వెళ్లే రహదారిలో కనిమెరక వీధికి, గొర్లేవిధికి మధ్య జంక్షన్‌లో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరగడం, పలువురు మృత్యువాత పడటంతో పాటు మరికొంత మంది కాళ్లు, చేతులు పోగొట్టుకుని మంచానికే పరిమితమైన వారు ఉన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలకి వచ్చినప్పుడు, విడిచి పెట్టినప్పుడు వాహనాలు అతివేగంతో పాటు రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల రోడ్డు దాటేందుకు విద్యార్థులు భయపడుతున్నారని ఉపాధ్యాయులు చెపుతున్నారు. స్థానిక ఉన్నత పాఠశాల వద్ద, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద, ప్రమాదకర మలుపులు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

ఎన్నికల హామీని వెంటనే నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సదాశివరావు

బొబ్బిలి: రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రీనిధి పాఠశాలలో శనివారం ఏపీటీఎఫ్ ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎం.బలరాంనాయుడి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను నిలిపివేసి వెంటనే పదోన్నతులు చేపట్టాలన్నారు. దీని వలన ఉపాధ్యాయుల కొరత తీర్చవచ్చన్నారు. అలాగే అక్టోబర్ 6 నుంచి జరిగే 20వ వైజ్ఞానిక మహాసభలతో పాటు 80వ వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ ఆర్.కృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు గంట సత్యనారాయణ, కార్యదర్శులు కె.సత్యారావు, ఎస్.సూర్యనారాయణ, ఐదు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి మోహనరావు తదితరులు

రాజాం: మండల కేంద్రంలోని మారుతీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద సంతకవిటి మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్(ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) 50వ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, సంతకవిటి మండల శాఖ అధ్యక్షుడు బూరాడ శ్రీనివాసం కలిసి యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం యూటీఎఫ్ భవిష్యత్ కార్యాచరణ, సభ్యుల బాధ్యతలు వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి డోల కృష్ణారావు, జిల్లా ఆడిట్ కన్వీనర్ అదపాక అప్పలనాయుడు, ఎస్.బాబూరావు, ఎల్.గణేష్, అదపాక దామోదరరావు, శంకరరావు, వి.చంద్రశేఖర్, ఎ.వి.నాయుడు, వి.ఆనందరావు, వి.సురేష్, కె.శ్రీనివాసరావు, జి.శేఖర్, జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

పత్ర కషాయంతో పంటలకు మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సంతకవిటి: పత్ర కషాయంతో పంటలకు ఎంతో మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రినర్ వెంకటలక్ష్మి, యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణలు అన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో పత్ర కషాయం తయారీ, దాని ప్రయోజనాలపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. పలు పంటలపై పత్ర కషాయం పిచికారీ చేయడం ద్వారా పంటకు చీడపీడలు పట్టవన్నారు. ప్రకృతి వ్యవసాయం అందరూ చేయాలని, ఈ వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అలాగే పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు.

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో చేపల పత్ర ద్రావణం తయారీపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎల్2 సురేష్ తొలుత ప్రయోగపూర్వకంగా ద్రావణం తయారు చేసి, చూపించారు. ఏవైనా 100 రకాల ఆకులను రెండు కిలోల చొప్పున 200 లీటర్ల నీటిలో వేసి, అందులో 10 లీటర్ల ఆవుమూత్రం కలిపి నలభై రోజుల పాటు ఉంచితే ద్రావణం తయారవుతుందన్నారు. అనంతరం పులిసిన ద్రావణాన్ని వరిపంటపై పిచికారీ చేస్తే తెగుళ్లు, చీడపీడలు సోకవన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సంతకవిటి: పత్ర కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

టీకాలతో వ్యాధులు దూరం



చిన్నారికి టీకా వేస్తున్న ఏఎన్‌ఎం ప్రశాంతి

తెర్లాం: వ్యాధి నిరోధక టీకాలు వేసుకుంటే వ్యాధులు దరిచేరవని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో(కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్) భాస్కరరావు అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–5లో వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులకు సచివాలయ ఏఎన్‌ఎం ప్రశాంతి టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వేయాల్సిన టీకాలు సకాలంలో వేయాలని సూచించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా టీకాలు వేసుకోవడం ద్వారా ఎటువంటి వ్యాధులు సోకవన్నారు. టీకాలు, వాటి ప్రయోజనాలపై గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు రెడ్డి శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ గంగునాయుడు, అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే పంచాయతీల అభివృద్ధి



రేగిడి: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్యామలాకుమారి

రాజాం: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలనా అంశాలు, సంక్షేమ పథకాల అమలు విధానాలను ఎప్పటికప్పుడు సర్పంచ్‌లకు కార్యదర్శులు చేరవేయాలని తెలిపారు. సర్పంచ్‌ల అధికారాన్ని సక్రమంగా అమలు చేసేందుకు సహకరించాలన్నారు. పంచాయతీల్లో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే అన్ని శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు.

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఎంపీడీవో శ్యామలాకుమారి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలను పంచాయతీల్లో అమలు చేయాలని, ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలన్నారు.

12 నుంచి శిక్షణ..

బొబ్బిలి రూరల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. గ్రామాల అభివృద్ధి, వాటికి తీసుకోవాల్సిన చర్యలు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం ఆవశ్యకతలను వివరించనున్నామన్నారు.

సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఎంపీడీవో జి.పైడితల్లి మాట్లాడుతూ ప్రజారోగ్యం బాగుండాలంటే గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాత్రి సమయంలో గ్రామాల్లో వీధి లైట్లు వెలిగేలా చూడాలన్నారు.